నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, సోమవారం 2 సెప్టెంబర్ 2024 | SURYAPET


గండిపడిన మేళ్లచెర్వు మండలం వెంకట్రాంపురం చెరువు


దేవరకొండ మండలం కొండభీమనపల్లి బీసీ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, కమలాకర్, బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భాస్కర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి

# వర్ష బీభత్సం

అతలాకుతలమైన సూర్యాపేట జిల్లా

కోదాడ, హుజూర్‌నగర్‌లో 30 సెంటీమీటర్ల వర్షపాతం

## పోటెత్తిన వరద.. ఉప్పొంగిన వాగులు, చెరువులు

- పలుచోట్ల చెరువులకు గండ్లు.. ఇండ్లలోకి చేరిన నీరు
- విరిగి పడిన చెట్లు.. నేలకూలిన విద్యుత్ స్తంభాలు
- నీట మునిగిన లక్షలాది ఎకరాల పంట పొలాలు
- కోదాడలో వరదకు కొట్టుకుపోయి ఇద్దరు మృతి
- నడిగూడెంలో సాగర్ ఎడమ కాల్వకు, పిల్లలమర్రిలో మూసీ కాల్వకు గండి
- భారీ వర్షాలపై జిల్లా మంత్రుల ఆరా.. అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు


నీట మునిగిన కోదాడ షిర్డీ సాయినగర్ కాలనీ


హుజూర్‌నగర్‌లో 15వ వార్డులో ఓ ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

**అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. శనివారం మొదలైన వాన ఆదివారం కూడా కొనసాగింది. సూర్యాపేట జిల్లాలో కురిసిన అతి భారీ వర్షపాతం అతలాకుతలం చేసింది. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో 30 సెంటీ మీటర్లు, తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల్లో 14 సెంటీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో ఎక్కడ చూసినా పోటెత్తున్న వరద దృశ్యాలే కనిపిస్తున్నాయి. భారీ వర్షానికి వాగులు, చెరువులు ఉప్పొంగుతున్నాయి. పలుచోట్ల చెరువులకు గండ్లు పడ్డాయి. ఇండ్లలోకి వరద నీరు చేరి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. అక్కడక్కడ ఇండ్లు కూలాయి. చెట్లు విరిగి పడగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వరదతో లక్షలాది ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. వరద ధాటికి రోడ్లు కోతకు గురయ్యాయి. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.**

– సూర్యాపేట, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ)


కోదాడ రూరల్ : కూచిపూడిలో కూలిన ఇల్లు

### వర్షం పోయినా పోటెత్తిన వరద

వర్షం తగ్గినా వరద పోటెత్తడంతో సూర్యాపేట జిల్లాలో దాదాపు 18 గంటలపాటు జన జీవనం స్తంభించింది. పలు కాలనీలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. కోదాడలో వరద ఉధృతిలో కొట్టుకు పోయిన కారులో నాగం రవి(36), బైక్ కొట్టుకుపోయి ఎరమల్ల వెంకటేశ్వర్లు(56) మృతి చెందారు. పట్టణాల్లో సెల్లార్లు, గ్రౌండ్ ఫ్లోర్లలోకి నీరు చేరడంతో నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రి తడిసిపోవడంతో వ్యాపారులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. రహదారులపై నీళ్లు ప్రవహించాయి. అన్ని శాఖలు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారు. సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, అదనపు కలెక్టర్ లత జిల్లా వ్యాప్తంగా పర్యటించి సహాయక చర్యలను పరిశీలించారు.

### పంటలకు తీవ్ర నష్టం

ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి సూర్యాపేట జిల్లాలో పెద్ద ఎత్తున పంటలు నీట మునిగాయి. సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలతోపాటు కోదాడ పరిధిలోని మోతె, మునగాల, నడిగూడెం, హుజూర్‌నగర్ పరిధిలోని మేళ్లచెర్వు, పాలకవీడు, మఠంపల్లి ప్రాంతాల్లో వేసిన పత్తి, పెసర, వరి పంటలు నీట మునిగాయి. వరద ప్రవాహంతో పంట పొలాల్లో మట్టి మేటలు పేరుకుపోయాయి. సాగర్ ఆయకట్టు అయిన కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో ఇటీవల నాట్లు వేస్తుండగా నీటి ప్రవాహానికి కొట్టుకుపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా వర్ష బీభత్సం, వరదల నేపథ్యంలో పరిస్థితిని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆరా తీశారు. సోమవారం కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో వర్షంతో దెబ్బతిన్న ప్రాంతాల్లో ఆయన పర్యటించనున్నారు.

### సాగర్, మూసీ కాల్వలకు గండ్లు

వరద పోటెత్తడంతో కోదాడ నియోజకవర్గ పరిధిలోని నడిగూడెం సమీపంలో నాగార్జున సాగర్ ఎడమ కాల్వకు గండి పడింది. దాంతో రామచంద్రాపురం గ్రామంలోకి నీళ్లు చేరడంతో జలదిగ్బంధంలో చిక్కుకుంది. పంటలు నీటమునిగాయి. సూర్యాపేట మండలం పిల్లలమర్రి సమీపంలో మూసీ ఎడమ కాల్వకు గండి పడింది. దీంతో పంట పొలాలు నీట మునిగాయి. మూసీ అధికారులు వెంటనే ఇసుక బస్తాలు వేసి గండిని పూడ్చారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో ఎన్‌ఎస్‌పీ అధికారులు యుద్ధ ప్రాతిపదికన గండిని పూడ్చే ప్రక్రియను ప్రారంభించారు.

### భారీ వర్షాలపై మంత్రి కోమటిరెడ్డి ఆరా

నీలగిరి : భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని పరిస్థితులపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోమవారం ఆరా తీశారు. జిల్లాలోని తాజా వాతావరణ పరిస్థితులపై ఎప్పటికప్పుడు కలెక్టర్‌తో సమాచారం తెప్పించుకొని సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఏ ఒక్కరూ విధులకు గైర్హాజరు కాకుండా చూసుకోవాలని కలెక్టర్ నారాయణ రెడ్డిని ఆదేశించారు. జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.


కోదాడ : నడిగూడెం సమీపంలో సాగర్ కాల్వకు గండి


కోదాడ : అనంతగిరి రోడ్డులో ప్రొక్లెయిన్‌లో విద్యార్థుల తరలింపు


చందంపేట : ఉధృతంగా ప్రవహిస్తున్న డిండి వాగు


మేళ్లచెర్వు నాగుల చెరువుకు గండి పడిన దృశ్యం


నీట మునిగిన ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలోని మోడల్ స్కూల్


కోదాడ : లోతట్టు కాలనీలో పర్యటించి బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్


మఠంపల్లి : మండల కేంద్రంలో దెబ్బతిన్న పరిశ్రమలోకి వెళ్లే రైల్వేట్రాక్


సూర్యాపేట రూరల్ : కుసుమవారిగూడెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు


సూర్యాపేట : నెమ్మికల్ వద్ద దంతాలపల్లి– సూర్యాపేట రహదారిపై ఉధృతంగా వస్తున్న నీరు


ఆత్మకూర్(ఎస్)లో ఇండ్లలోకి చేరిన వరదనీరు

## కిటికీల నుంచి ఎలుకలు వస్తున్నాయి

- హాస్టల్‌లో ఫ్యాన్లు పని చేయక ఇబ్బంది పడుతున్నాం
- కరెంట్ పోతే దోమల బాధ
- మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల బృందానికి సమస్యలు తెలిపిన విద్యార్థులు
- కొండ భీమనపల్లి బీసీ గురుకుల పాఠశాల సందర్శించిన బీఆర్‌ఎస్ నాయకులు

దేవరకొండ రూరల్, సెప్టెంబర్1 : మండలంలోని కొండ భీమనపల్లి శివారులో ఉన్న బీసీ బాలుర గురుకుల పాఠశాలను ఆదివారం బీఆర్‌ఎస్ మాజీ మంత్రులు, సిద్దిపేట, సూర్యాపేట ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సందర్శించారు. గత నెల 26న గురుకులంలో విద్యార్థులపై ఎలుకల దాడి ఘటన రాష్ట్రంలో కలకలం రేపింది. సంఘటన జరిగిన మరుసటిరోజు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ పాఠశాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఇదే విషయమై గాయపడిన 13మంది విద్యార్థులను ఆదివారం మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేలతో కలిసి పరామర్శించారు. అక్కడ నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఫ్యాన్లు లేకపోవడం వల్ల కిటికీలు తీయడంతో అందులో నుంచి ఎలుకలు వస్తున్నాయని, నిద్రిస్తున్న సమయంలో దాడి చేస్తున్నాయని విద్యార్థులు వారికి తెలిపారు. బాత్‌రూం డోర్లు సరిగా లేకపోవడం, దోమ తెరలు లేకపోవటం వల్ల ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. కరెంట్ పోయినప్పుడు జనరేటర్ లేకపోవడం వల్ల చీకట్లో అవస్థలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు రగ్గులు, ట్రాక్ సూట్, స్పోర్ట్స్ డ్రెస్సులు అందించలేదని, భోజనం నాణ్యత లేదని విద్యార్థులు తమ గోడు వినిపించారు. ఇంకా పలు సమస్యలతో సతమతమతున్నామని విద్యార్థులు నాయకులతో చెప్పి వాపోయారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని తమ ఆరోగ్యాలను కాపాడాలని వారి ముందు కోరారు. ప్రభుత్వం గురుకులాలను పట్టించుకోకపోవడంతోనే ఇలాంటి సమస్యలు వస్తున్నాయని మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించామని తెలిపారు. బీసీ గురుకుల పాఠశాల చుట్టూ చెట్లు, పొదలు ఉన్నందున పాములు, తేళ్లు వచ్చే అవకాశం ఉందని, యాంటీవీనమ్ ఇంజెక్షన్ కూడా దగ్గర ఉండకపోవడం నిర్లక్ష్యాన్ని చూపుతుందని, ఇది విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడటమేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్‌రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, నల్లమోతు భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, రేగట్టె మల్లికార్జున్, టీవీఎన్‌రెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి, చింతపల్లి సుభాష్, గాజుల రాజేశ్ పాల్గొన్నారు.


నార్కట్‌పల్లి : అమ్మనబోలు వద్ద వాగును పరిశీలించి స్థానికులతో మాట్లాడుతున్న నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

## కేతేపల్లిలో అత్యధికంగా 16.8 సెంటీమీటర్ల వర్షం

- నల్లగొండ జిల్లాలో 10.9 సెంటీమీటర్ల సగటు వర్షపాతం
- ఈ సీజన్‌లో ఇదే అత్యధికం
- పలుచోట్ల ఉధృతంగా ప్రవహించిన వాగులు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్, ఎస్పీ
- హైవేలపై వాహనాల దారి మళ్లింపు
- చెర్వుగట్టులో మూడుగుండ్ల దర్శనం నిలిపివేత


హుజూర్‌నగర్‌లో వర్షంతో దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్1(నమస్తే తెలంగాణ) : నల్లగొండ జిల్లా అంతటా అల్పపీడన ప్రభావంతో కురిసిన ఆస్నా తుఫాన్ ఎఫెక్ట్ కనిపించింది. శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం ఉదయం 6గంటల వరకు నల్లగొండ జిల్లా సగటు వర్షపాతం 10.9 సెంటీమీటర్లు నమోదైంది. అత్యధికంగా కేతేపల్లిలో 16.8సెంటీమీటర్లు కురిసింది. వేములపల్లిలో 16.3, చండూరులో 15.4, మిర్యాలగూడలో 14.5, కొండమల్లేపల్లిలో 13.8, గట్టుప్పల్‌లో అతి తక్కువగా 3.5సెం.మీటర్ల వర్షం కురిసింది. ఇక ఆదివారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు పరిశీలిస్తే కొన్ని ప్రాంతాల్లో మాత్రమే వర్ష ప్రభావం కనిపించింది. నార్కట్‌పల్లిలో 4.9 సెంటీమీటర్లు, చిట్యాలలో 2.4, కట్టంగూర్‌లో 2.2, శాలిగౌరారంలో 1.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా అన్ని ప్రాంతాల్లోనూ చిరుజల్లులు మినహా వర్షం లేదని వాతావరణ శాఖ వెల్లడించింది.

### వర్షంతో అంతరాయాలు

నల్లగొండ పట్టణంలోని ఎఫ్‌సీఐ కాలనీ, పాతపల్లె, శేషమ్మగూడెం కాలనీలను వరద నీరు ముంచెత్తడంతో కోటప్పమత్తడి వద్ద జేసీబీతో వరదను క్లియర్ చేశారు. కేతేపల్లిలోని జడ్పీ హైస్కూల్‌తో పాటు ప్రైమరీ పాఠశాల భవనాలపై చెట్లు విరిగిపడడంతో భవనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఇదే మండలంలోని కొత్తపేట పెద్దచెరువు అలుగు పోయగా ఉప్పలపహాడ్ వద్ద వరద నీటిలో వరి పొలాలు మునిగిపోయాయి. నల్లగొండ ఆర్డీఓ రవి, తాసీల్దార్ మధుసూదన్‌రెడ్డి సందర్శించి తగు చర్యలకు ఆదేశించారు. త్రిపురారం మండలం పలుగుతండాలో కరెంటు స్తంభాలు విరిగిపడగా తుంగపాడు వాగు ఉధృతికి పంట పొలాలు నీట మునిగాయి. పలువురు కరెంటు మోటార్లు వరద ఉధృతిలో కొట్టుకుపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండలోని మోతికుంట వద్ద వరద ఉధృతిని అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీఓ రవి సమీక్షించి తగిన ఆదేశాలిచ్చారు. మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుపై భారీ చెట్లు కూలి రాకపోకలకు అంతరాయం కలిగింది. తక్కెళ్లపాడు సమీపంలోని పాలేరు వాగుపై నిర్మించిన వంతెన వరద ఉధృతికి కోతకు గురైంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొండమల్లేపల్లిలోని అంబేద్కర్ కాలనీలోకి వరద నీరు వచ్చి ఇండ్ల మధ్య నిలువడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు వద్ద మూసీ ఉధృతిని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్ చంద్ర పవార్ కలిసి పరిశీలించి లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మండలంలోని అమ్మనబోలు నుంచి రామానుజపురం వెళ్లే దారిలో లోలెవల్ కల్వర్టుపై నుంచి వరద ఉప్పొంగడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. తిప్పర్తి మండలం కాశివారిగూడెంలో కాల్వకు గండిపడగా డీఎస్పీ శివరాంరెడ్డి, ఎస్‌ఐ డి.రాజు ఘటన స్థలాన్ని పరిశీలించి స్థానికులను అప్రమత్తం చేశారు.

### నార్కట్‌పల్లి, నకిరేకల్ వద్ద దారి మళ్లింపు

హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే వాహనాలను నార్కట్‌పల్లి వద్ద దారి మళ్లించారు. కోదాడ మండలం నల్లబండగూడెం శివారులోని రామాపురం బ్రిడ్జి వద్ద హైవేపై నీరు ప్రవహిస్తున్నది. దీంతో విజయవాడ వైపు వెళ్లే వాహనాలను నార్కట్‌పల్లి నుంచి మిర్యాలగూడ, వాడపల్లి, గుంటూరు మీదుగా విజయవాడకు వెళ్లేలా ఆదేశాలిచ్చారు. ఇక హైదరాబాద్ నుంచి సూర్యాపేట మీదుగా ఖమ్మం వెళ్లాల్సిన వాహనాలను కూడా నకిరేకల్ వద్ద దారి మళ్లిస్తున్నారు. కూసుమంచి మండలంలోని పాలేరు వద్ద హైవేపైకి వరద నీరు రావడంతో ఖమ్మం వైపు వెళ్లాల్సిన వాహనాలను నకిరేకల్ నుంచి అర్వపల్లి, మరిపెడబంగ్లా మీదుగా ఖమ్మం వైపు దారి మళ్లించారు. భారీ వర్షాల కారణంగా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు దేవస్థానం ఘాట్‌రోడ్డులో వాహనాల రాకపోకలను నిషేధిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయంపై భాగంలో ఉండే మూడు గుండ్ల దర్శనాన్ని కూడా నిలిపివేస్తున్నట్లు ప్రకటిస్తూ భక్తులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## నేడు విద్యా సంస్థలకు సెలవు

నేటి ఎంజీయూ పరీక్షలు వాయిదా

రామగిరి/సూర్యాపేట/సూర్యాపేట అర్బన్, సెప్టెంబర్ 1: భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం విద్యా సంస్థలకు సెలవు ప్రకటించినట్లు నల్లగొండ, సూర్యాపేట కలెక్టర్లు సి.నారాయణరెడ్డి, తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లు బంద్ చేయాలని పేర్కొన్నారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో సోమవారం జరిగే ఎంఈడీ, ఎల్‌ఎల్‌బీ పరీక్షలను వాయిదా వేసినట్లు ఎంజీయూ పరీక్షల నియంత్రణాధికారి జి.ఉపేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 నుంచి జరుగాల్సిన పరీక్షలు గతంలో వెల్లడించిన టైంటేబుల్ ప్రకారం యథావిధిగా ఉంటాయని పేర్కొన్నారు.